

నేటి నుంచి ప్రజారక్షణభేరి స్కూటర్ యాత్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి సిపిఎం ప్రజా రక్షణ భేరి స్కూటర్ యాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన వివిధ రంగాల నిపుణులతో సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి 9వ తేదీ వరకు స్కూటర్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమలు, ఉపాధి, విద్య, వైద్యం, సామాజిక తరగతుల అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించామని తెలిపారు. జిల్లా వ్యవసాయంలో 8 సంవత్సరాలలో అనేక మార్పులు వచ్చాయని, వీటికి అనుగుణంగా వ్యవసాయ శాఖ నైపుణ్యాన్ని, మార్కెటింగ్ సౌకర్యాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పండ్ల తోటల విస్తీర్ణానికి అనుగుణంగా స్థానిక పరిశ్రమలు ఏర్పాటు చేసి అటు రైతులకు ఇటు నిరుద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. తుంగభద్ర ఆధునీకరణ చేయాలని, హంద్రీనీవా ఆయకట్టుకు సాగునీరు అందించాలని అన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను స్థాపించి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను పెంచాలన్నారు. స్టార్ అప్ ఐటి పరిశ్రమలను జిల్లాలో అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. ఖనిజ వనరుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సామాజిక తరగతులకు విద్య వైద్యం ఖరీదైన సరుకుగా మారిందన్నారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రితో పాటు అర్బన్, రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెరుగు పర్చాలని కోరారు. తక్షణం కరువు సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు పరిహారం, 200 రోజులు ఉపాధి హామీ పనులు పెట్టాలని కోరారు. హెచ్ఎల్సి, హంద్రీనీవా కాలువల కింద సాగు చేసిన పంటలు పూర్తయ్యే వరకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధి కోసం సిపిఎం చేస్తున్న స్కూటర్ యాత్రను జయప్రదం చేయాలని వి. రాంభూపాల్ కోరారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం కండి : సోషల్ వెల్ఫేర్ జేడీ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యార్థులు ఇప్పటి నుంచే పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలని సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్‌రావు సూచించారు. ఆదివారం నగరంలోని ఎస్సీ నెంబర్.బి-4 హాస్టల్లో ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే మొదట డివిజన్ల వారీగా, రెండోసారి జిల్లాకేంద్రంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి టూటర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. కావున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం సబ్జెక్టు టీచర్లు ఆదినారాయణ, పివి రమణ, సూర్యనారాయణరెడ్డి, లోకేశ్వరరావుకు పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధం కావాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, వార్డెన్లు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ ఐక్య పోరాటాలు

కల్లూరులో దళిత, గిరిజన ప్రజాసంఘాల నాయకుల పర్యటన

సిఐ నరేందర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండలంలోని కల్లూరులో గుడిసెలు తొలగించిన పేదలందరికీ న్యాయం జరిగేంత వరకూ ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడుతామని దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కల్లూరులో పేదల గుడిసెలు తొలగించిన స్థలాన్ని పరిశీలించి బాధితులను ప్రమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలు తొలగింపులో ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషించిన సిఐ నరేందర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో దాదాపుగా ఉన్న ఇళ్ల స్థలాలన్నీ లక్ష్మీనరసింహస్వామి దేవుని మాన్యం భూములే అన్నారు. అయితే అగ్రవర్ణాల వారు నిర్మించుకోవడం, ఆక్రమించుకున్నారన్నారు. వాళ్లెవరినీ పట్టించుకోకుండా కేవలం సెంటు స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమన్నారు. పేదల పక్షాన ప్రశ్నించడానికి వెళ్లిన సిపిఎం నాయకులపై సిఐ నరేంద్రరెడ్డి చేయిచేసుకోవడం హేయమైన చర్య అన్నారు. పేదల సమస్యల పరిష్కారానికి సిపిఎం నాయకులు పని చేస్తారనే విషయాన్ని వారు తెలుసుకోవాలని సూచించారు. పోలీసులే పేదల గుడిసెలు తొలగించడం దుర్మార్గంగా ఉందన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులను భేఖాతరు చేస్తూ ప్రభుత్వం పేదలను నడిరోడ్డుపై పడేసిందని మండిపడ్డారు. అధికారులు వైసిపి కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే దళితులపై కర్కశంగా వ్యవహరించిన సిఐ నరేంద్రరెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుడిసెలు కూల్చివేతపై ఈనెల 9న అనంతపురం కలెక్టర్ ముందు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు చిన్న ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, టిడిపి నాయకులు

నిత్యావసర వస్తువులు పంపిణీ

మండలంలోని కల్లూరు గ్రామంలో గుడిసెలు కోల్పోయి వీధిన బడ్డ 150 బాధిత కుటుంబాలకు సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, టిడిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, అశోక్, జగదీష్, బాబయ్య, రామ్మోహన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



నడిరోడ్డుపై కర్రతో ఏర్పాటే చేసిన సూచిక

దిష్టిబొమ్మ కాదు..

ప్రమాద సూచిక...

బుక్కరాయసముద్రం వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన కర్ర

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పైన కనిపిస్తున్నది దిష్టిబొమ్మ కాదు... జాతీయ రహదారిపై ఏర్పడిన గుంత ఉందని చెబుతూ స్థానికులు ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక. వివరాల్లోకి వెళ్తే...

మండల కేంద్రం సమీపంలోని అనంతపురం - తాడిపత్రి ప్రధాన రహదారిలో చెరువు కట్ట కింద ఓ ఊరగాయల ఫ్యాక్టరీ సమీపంలో గోతి ఏర్పడింది. అయితే అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గోతి కారణంగా ప్రమాదాలు జరగకుండా స్థానికులు ఓ కర్రకు యూరియా సంచి వేసి నిలబెట్టారు. ప్రధాన జాతీయ రహదారి కావడంలో నిత్యం వేలాది వాహనాలతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, ఉన్నతాధికారులు తిరుగుతూనే ఉంటారు. అయినా ఈ గోతి ఎవరికీ కనిపించకపోవడం బాధాకరం. ఈ విషయంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప స్పందిస్తూ పేదలు ఎక్కడైనా చిన్న గుడిసె వేసుకుంటే వెంటనే స్పందించే పాలకులు, అధికారులు ఇలాంటి గుంతలు ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారి కావడంతో ఎప్పుడేం జరుగుతుందో అని వాహనదారులు, ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ తీసుకుని వెంటనే గుంతలు పూడ్చాలని డిమాండ్ చేశారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడి అమానవీయం

అనంతపురం కలెక్టరేట్ : గాజాలోని హమాస్, పాలస్తీనాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడి అమానవీయంగా ఉందని, తక్షణమే యుద్ధం ఆపాలని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గాజాపై ఇజ్రాయిల్ దాడిని నిరసిస్తూ పాలస్తీనాకు సంఘీభావంగా ఆదివారం జెఎసి ఆధ్వర్యంలో కొత్వుల శాంతి ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం, సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి, ఆవాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలి, ముస్కిన్, కమిటీ సభ్యులు ఇస్మాయిల్, ఫకృ, శర్మాస్, హుసేన్, షేక్షావలి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, ఫయాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, బంగారు బాషా, ఐఎంఎం మహబూబ్‌బాషా, టిడిపి ముక్తియార్, సాలార్‌బాషా, పెద్ద ఎత్తున ముస్లీం మహిళలు, పిల్లలు తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.

సిఎం చెప్పే క్లాస్‌వార్ పేదల గుడిసెలు తొలగించడమా..?

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి తాడిపత్రి

సీఎం జగన్మోహన్ రెడ్డి పెత్తందారులపై పోరాడుతూ క్లాస్ వార్ చేస్తున్నానని ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తుంటే ఎమ్మెల్యేలు భూ అక్రమంలో భాగంగా పేదల నివాస స్థలాలు గుడిసెలను సైతం వదలని విధంగా ఆక్రమణకు పాల్పడుతున్నారని అఖిలపక్ష నాయకులు అన్నారు. కల్లూరులో గుడిసెల తొలగింపు ఘటన పైనా, జిల్లా సమగ్రాభివృద్ధి పైనా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు రాజారాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్లనిర్మించకపోగా ఉన్న గుడిసెలు కూల్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు.కల్లూరు గ్రామంలో 108 కుటుంబాలపై కనీస కనికరం లేకుండా, సమాచారం ఇవ్వకుండా వైసీపీ నాయకుల పర్యవేక్షణలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ గుడిసెలను తొలగించడం దుర్మార్గమన్నారు. ఇది వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు పరాకాష్టగా అభివర్ణించారు. జగన్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి నియంత పాలన జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ పీనల్ కోర్టు ఆదేశాల నడుస్తున్నాయని వ్యాఖ్యానించారు. హైకోర్టు నోటీసులను చెత్త పేపర్లతో సమానంగా చూస్తోందని అందుకు ఉదాహరణ గుడిసెలు తొలగించరాదని హైకోర్టు ఆదేశాలు ఉన్న తొలగించడమేనని అన్నారు. సిపిఎం నాయకులపై దాడి చేయించడాన్ని చూస్తే భూ ఆక్రమణ పై ఎమ్మెల్యేలకు ఎంత ఆసక్తి ఉందో అర్థమవుతుందన్నారు. ప్రతి పేదవాడికి నివాస స్థలం కేటాయిస్తామన్న సీఎం జగన్మోహన్ రెడ్డి కల్లూరులో తొలగించిన 108 కుటుంబాల గోడు వినపడకపోవడం దురదృష్టకరమన్నారు. నాయకులు వేల ఎకరాల్లో కబ్జాలు, కోట్ల రూపాయల సంపాదన, భారీ స్కాములుతో లబ్ధి పొందుతుంటే ప్రభుత్వానికి కన్పించలేదన్నారు. పేదలు నివాసం ఉండడానికి గూడు కట్టుకుంటే ఆక్రమణలుగా సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెల తొలగింపులో బాధితులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వమే పరిహారంగా అందజేసి వారి స్థలాలకు పట్టాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కల్లూరులో గుడిసెల తొలగింపు బాధితులకు అండగా ఉంటామన్నారు. పేదలకు అండగా నిలిచిన సిపిఎం నాయకులు పై దురుసుగా ప్రవర్తించిన సిఐ నరేంద్ర రెడ్డిని విధుల నుండి తప్పించాలని, భవిష్యత్తులో ఈ జిల్లాలో ఆయన విధులు నిర్వహించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేదల గుడిసెల తొలగింపు వెనుక ఉన్న కుట్రను బయటపెట్టాలని క్లాస్‌వార్ అంటున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నామని అన్నారు. పేదలకు అండగా ఉండడాన్ని జీర్ణించుకోలేక సిపిఎం నాయకులపై పోలీసులతో దాడి చేయించారని దాడి చేసిన సీఐ నరేందర్ రెడ్డి పైనా, చేయించిన వైసీపీ నాయకులకుపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు జగన్మోహన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, సిపిఐ సీనియర్ నాయకులు రంగయ్య, తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ మల్లికార్జున, ఆమ్ ఆద్మీ పార్టీ మహబూబ్ బాషా, సిఐటియు, పూసల సంఘం, కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.



అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన పార్టీ ప్రతినిధులు, సంఘాల నాయకులు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నారీశక్తి సమ్మేళనంలో కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్


మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని టీవీ టవర్ ఎదురుగా ఉన్న జిఎంఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో మహిళలు మనశ్శాంతితో ఉండాలంటే శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోజులో ఉన్న 24 గంటల్లో మహిళలు చక్కగా ప్రణాళిక వేసుకొని సమయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో 13 ప్రాంతాల్లో నారీశక్తి సమ్మేళనం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. మహిళా శక్తితో పాటు భారతీయ సంస్కృతికి పెద్దపీట వేస్తూ మహిళల్లో చైతన్యం కలిగించడం ద్వారా కుటుంబ విలువలను పరిరక్షించడం, దేశ సమగ్ర అభివద్ధిలో మహిళ భాగస్వామ్యాన్ని పెంచడం, వివిధ రంగాలలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనడం, మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం కోసం నారీ శక్తి సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. వివిధ రంగాల్లో స్ఫూర్తి నింపిన మహిళామూర్తులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కి చెందిన సామాజిక కార్యకర్త, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ ముదిగొండ సుష్మ, తిరుపతి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్మెంట్ డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఇండిపెండెంట్ డైరెక్టర్ పెన్నాకృష్ణ ప్రశాంతి, ఏపీ నేషనల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్ లింగం ఉజ్వల, రాజమహేంద్రవరం వనవాసి కళ్యాణాశ్రమం జిల్లా ప్రముఖ్, మహిళా సమన్వయ ప్రాంత ప్రబారి, విద్యావేత్త పద్మావతి, లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి మాధవి, సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయర్ లర్నింగ్ ప్రఫుల్ల, నిత్య సురభి చారిటబుల్ ట్రస్ట్ నిర్మల మురళి, వాసవి అమ్మవారిశాల మహిళా మండలి అధ్యక్షురాలు స్వర్ణలతతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎమ్. వీర్రాజు



ప్రజాశక్తి అనంతపురం

జిల్లాలో రోడ్డు భద్రతే ప్రధాన అజెండాగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ దిశగా అనంతపురం జిల్లా రవాణా శాఖ సమిష్టిగా కృషి చేస్తోందని రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎమ్. వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : అనంతపురం జిల్లాలో రోడ్డు భద్రత వారోత్సవాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాం. ప్రధానంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం కలిగించే చర్యలు తీసుకున్నాం.

ప్ర : జిల్లాలో ఎన్ని రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి ?

జ : అనంతపురం జిల్లాలో జిల్లా కేంద్రంలోని డిప్యూటీ రవాణా శాఖ అధికారి కార్యాలయంతో పాటు తాడిపత్రిలో యూనిట్ కార్యాలయం, గుంతకల్లు, రాయదుర్గంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు అందుబాటులో ఉన్నారు.

ప్ర : రవాణా శాఖ ప్రజలకు ఎన్ని రకాల సేవలందిస్తోంది ?

జ : ప్రభుత్వ రవాణా శాఖ ద్వారా ప్రజలకు 82 రకాల సర్వీసులు అందుతున్నాయి. లైసెన్సులు, ఫిట్నెస్, రిజిస్ట్రేషన్, లైఫ్ టాక్స్, క్వాటర్లీ టాక్స్ ఇలా 82 రకాల సర్వీసులను రోడ్డు రవాణా శాఖ ప్రజలకు అందిస్తోంది.

ప్ర : ప్రజల నుండి పన్నులను ఎలాంటి సందర్భాల్లో వసూలు చేస్తున్నారు ?

జ : వాస్తవానికి రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి రోడ్డు భద్రత నియమాలను పాటించే క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించడం రవాణా శాఖ ముఖ్య ఉద్దేశం. అయితే నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం సంబంధిత అపరాధ రుసుము వసూలు చేయడం రవాణా శాఖ బాధ్యత. అందులో భాగంగా ఈ ఏడాది ప్రభుత్వానికి రూ. 287 కోట్ల అపరాధ రుసుము ద్వారా అందించేందుకు లక్ష్యాన్ని నిర్ధారించుకున్నాం. అందులో ఇప్పటివరకు దాదాపుగా 50 శాతం పైగా వసూలు చేయడం జరిగింది. అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

ప్ర : ఆన్‌లైన్ పరంగానే అన్ని సేవలు అందుతున్నాయా..?

జ : నూతన సమీకరణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 82 సర్వీసులను ప్రజలకు అందిసోంది. అందులో మూడు రకాల సర్వీసుల కోసం ప్రజలు తప్పనిసరిగా కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. మిగిలిన సర్వీసులను ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. డ్రైవింగ్, లైసెన్సు, ఫిట్నెస్, ఎల్ఎల్ఆర్, ఆధార్, ఫిట్నెస్ వెహికల్, ట్రాన్స్‌ఫర్, డెత్ సర్టిఫికెట్ వంటి వాటికోసం మాత్రమే రవాణా శాఖ కార్యాలయానికి ప్రజలు రావాల్సి ఉంటుంది.

ప్ర : కొత్త విధానాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూతున్నదా.?

జ : రాష్ట్ర ప్రభుత్వం వాహన్, సారధి పోర్టర్లను ప్రారంభించడంతో ప్రజలకు ఇటు ప్రభుత్వానికి ఉపయోగకరమైన వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఈ పోర్టల్ ద్వారానే అన్ని సేవలు అందుతున్నాయి. ఇప్పటివరకు 50 శాతం రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేయడం జరిగింది. ఆన్‌లైన్ సేవల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు అసౌకర్యాలు కలవకుండా అప్లికేషన్ వేసిన కస్టమర్లు ఆన్‌లైన్ అప్లోడ్ స్థాయిలో ఏవో, ఆర్టీవో స్థాయి అధికారుల పరిశీలన ద్వారా పూర్తిస్థాయిలో నిర్ధారించబడతాయి. కాబట్టి రవాణా శాఖ సేవలు పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయి.

ప్ర : జిల్లాలో వాహనాలు ఎన్ని ఉన్నాయి.?

జ : అనంతపురం జిల్లాలో 4.30 లక్షల నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు, 58వేల ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఉన్నాయి. వివిధ కారణాలవల్ల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 100 వాహనాలను సీజ్ చేశాం. ఆ వాహనాలను వేలం ద్వారా మార్కెట్లో అమ్మడం జరుగుతుంది. టెంపరరీ రిజిస్ట్రేషన్ లేకుండా రోడ్డుపై తిరిగే వాహనాలపై, సంబంధిత డీలర్లపై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : జిల్లాలో ఎంతమంది వాహన డీలర్లు ఉన్నారు?

జ : అనంతపురం జిల్లాలో రెండు, మూడు, నాలుగు చక్రాల వాహన డీలర్లు 73 మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 24 కిలో వాట్స్ తక్కువ ఉండే ఎలక్ట్రికల్ బైక్ లకు జులై 2023 నుండి టాక్స్ అమలు చేస్తోంది. అంతకుమునుపు కొన్న వాహనాలకు లైసెన్సు, రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

ప్ర : ఇటీవల కాలంలో రవాణా శాఖ మీద పలు అభియోగాలు వచ్చాయి. వాటిపై మీ స్పందన .?

జ : ప్రభుత్వ శాఖల్లో ఇలాంటి అభియోగాలు మామూలుగా వినపడుతుంటాయి. అయితే ఒక ఉన్నత స్థాయి అధికారిగా నా వంతుగా నిఘాను పెంచాను. సమిష్టిగా ఈ అభియోగాన్ని ఎదుర్కొనటం మా బాధ్యత. గతంలో 2021లో 50 వాహనాలు ట్రాన్స్‌ఫర్ చేయడంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ప్రస్తుతం చట్టం పరిధిలో దస్త్రాలు ఉన్నాయి. చట్టపరమైన చర్యలను తీసుకోవడానికి వారిపై క్రిమినల్ కేసులు కూడా పెట్టాం. పెద్ద ఎత్తున విస్తరించి ఉన్న రవాణా శాఖ పరిధిలో సిబ్బంది కొరత ఉండటం వల్ల కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నా సమిష్టిగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం మా బాధ్యతగా ముందుకు వెళుతున్నాము.



ప్ర : రోడ్ సేఫ్టీ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా రోడ్డు భద్రత మన బాధ్యత అనే క్రమంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 80 లక్షల రూపాయలను కేటాయించి కళ్యాణదుర్గం గుత్తి ప్రాంతాలలో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు కోసం పరికరాలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ప్రతినెలా ప్రజలకు హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అనేక సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర : నిబంధనలు పాటించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : ప్రభుత్వ నిబంధన అతిక్రమించి వ్యవహరిస్తున్న వారిపై రోడ్డు రవాణా శాఖ అధికారులు తగిన చర్యలను ఎప్పటికప్పుడు తీసుకుంటున్నారు. ప్రజా చైతన్యం కోసం ఒకపక్క కృషి చేస్తూ మరోవైపు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా ఓవర్ లోడ్ వాహనాలపై దృష్టి సారించాం. ప్రతి నెలా 200 కేసులు బుక్ చేస్తున్నాం. ఇదే క్రమంలో విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని స్కూలు బస్సులపై నిఘా ఉంచాం.ఇప్పటివరకు 535 స్కూలు బస్సులు ఎఫ్సీని పూర్తిచేసుకుని రోడ్డుపై తిరుగుతున్నాయి 45 బస్సులు ఎఫ్సి చేసుకోలేదు. ఈ బస్సులను రోడ్డుపై తిప్పకూడదని యాజమాన్యాలకు తెలియజేశాం. ప్రజలు ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనలు పాటించడంతోపాటు చైతన్యం కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

ప్ర : రవాణా శాఖ అధికారిగా ప్రజలకు మీ సూచన..

జ : ప్రజలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం ఎంతో అవసరం. ప్రతి క్షణం, నిమిషం, గంట విలువైనదే. అయితే అంతకన్నా విలువైనది ప్రాణం. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రధానంగా హెల్మెట్, సీటు బెల్టు, స్పీడ్ లిమిట్ వంటి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. తమ కుటుంబాలను గుర్తుచేసుకొని వ్యవహరించాలి.



వైద్య శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు

గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన

ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

ధర్మవరం ఆత్మీయ ట్రస్టు ధర్మవరం ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ హార్ట్ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో పట్టణంలోని సరోజినీనాయుడు పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని డీఎస్పీ నరసింగప్ప, మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బారాయుడు, ఆత్మీయ ట్రస్టు ఛైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవ, సమాజ హితం కోసం ఆత్మీయ ట్రస్టు నిస్వార్థ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరంలో 2డి ఎకో, ఇసిజి, బ్లడ్ షుగర్, బి.పి వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు నాగార్జున, ప్రసాద్, జెవివి సత్యసాయి జిల్లా అధ్యక్షులు అదిశేషు, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామప్పచౌదరి, మార్క్ ఆసుపత్రి డాక్టర్లు అమర్, అర్షద్, మేనేజర్ వెంకటేష్, స్థానిక నాయకులు శ్రీనివాసులు, శంకరయ్య, మల్లికార్జున, రాజకుమార్, జానకి, సిద్ధయ్య, ఎల్లన్న, సుధాకర్, పెన్నయ్య, తమ్మారెడ్డి, విశ్వేశ్వర బాబు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడులో పర్యటిస్తున్న పోలీసులు

గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం సాగించాలని సిఐ శంకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామం దేవుని ఉప్పలపాడులో సిఐ ఆధ్వర్యంలో పోలీసులు పర్యటించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్ల ఇళ్లు, పంట పొలాలు, గడ్డివాముల్లో తనిఖీలు చేశారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల జోలికి వెళ్లకుండా గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులు దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న, చిన్న సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అలాకాకుండా గొడవలకు వెళ్తే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. అంతేకాకుండా కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతుందన్నారు. కావున సమస్యలు జోలికి పోకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శరత్‌చంద్ర, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : యల్లనూరు మండలం కల్లూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పుట్లూరు సిఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా అనుమానితుల ఇళ్లు, రౌడీషీటర్ల ఇళ్లు, చుట్టుపక్కల పరిసరాలు, రాజకీయ నాయకుల ఇళ్లు, గడ్డివాములు, కళ్లందొడ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంపత్‌కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చు పెడుతున్న వైసిపి బస్సుయాత్ర

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

అధికారం కోల్పోతామన్న భయం, అభద్రత భావంతో కులాల మధ్య చిచ్చుపెట్టేందుకే వైసిపి బస్సుయాత్ర చేపట్టిందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విమర్శించారు. ఆదివారం నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపి చేసిన అభివృద్ధి ఏంటో స్పష్టంగా చెప్పే దమ్మూధైర్యం మంత్రులు, ఎమ్మెల్యేలకు లేదన్నారు. ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన వైసిపి బస్సుయాత్రలో అసాంతం ఒక కులాన్ని తిట్టేందుకు పరిమితం కావడం, కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుటిల పన్నాగాలు పొందేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. నా బీసీలు.. నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. నా మైనార్టీలు.. అని చెప్పుకునే సిఎం జగన్ క్రియాశీలక పదవులన్నీ ఆయన సామాజిక, బంధు వర్గానికి కట్టపెట్టడం బాధాకరమన్నారు. వీటన్నిటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బస్సుయాత్ర కాదు.. మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఎప్పుడైతే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనని చెప్పారో ఆ రోజే వైసిపి ఓటమి ఖాయమైందన్నారు. జనసేన, టిడిపి సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాప్రభుత్వాన్ని స్థాపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయం

వైసిపి యువజన విభాగం జోనల్ అధ్యక్షులు వై.ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



పైప్‌లైన్ నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న వైసిపి యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు వై.ప్రణయ్‌రెడ్డి

జలజీవన్ మిషన్ ద్వారా వచ్చే డిసెంబర్ ఆఖరికి పట్టణంలో ప్రతి ఇంటికీ ఉచిత కొళాయి కనెక్షన్ ఇవ్వడంతోపాటు సురక్షిత మంచినీరు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని వైసిపి యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు వై.ప్రణయ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని చంగలవీధిలో జలజీవన్ మిషన్ కింద నూతన పైపులైన్ నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా జలజీవన్ మిషన్ కింద రూ.11 కోట్లతో పనులు చేపట్టినట్టు తెలిపారు. వీటిలో ఇప్పటికే సగం పనులకుపైగా పూర్తయ్యాయన్నారు. వచ్చే డిసెంబరు ఆఖరుకి పట్టణంలో ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి ఇచ్చే దిశగా పనులు వేగంగా చేస్తున్నామన్నారు. దీంతోపాటు త్వరలో ఉదిరిపికొండ నుంచి తాగునీటి పైపులైన్ నిర్మాణం, నింబగల్లు నుంచి అదనపు పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయని, అవి పూర్తయితే పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఉప సర్పంచి వన్నప్ప, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, జెసిఎస్ మండల కన్వీనర్ ఆసీఫ్, ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల వైసిపి నాయకులు ఆంజనేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోండి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



అధికారులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని, ప్రజలందరూ తమ ఓటు ఉందో.. లేదో.. సరిచూసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి సూచించారు. ఆదివారం నగరంలోని రామ్‌నగర్ మదర్‌థెరిసా మున్సిపల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఎలక్షన్ కమిషన్ నియమించిన సిబ్బంది దగ్గర తమఓటును తనిఖీ చేసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారుల అండతో చాలామంది ఓట్లను తొలగించిందని, కావున పౌరులు విధిగా ఓటు హక్కును తనిఖీ చేసుకోవాలన్నారు.

విభజన హామీలను అమలు చేయాలి

15న విజయవాడలో 'ప్రజారక్షణ భేరి' - సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల



పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈనెల 15న విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ 6వతేదీన చేపట్టనున్న స్కూటర్ జాతాకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాగా నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయాలని, హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు చేపట్టాలని, ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వలసల నివారణకు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు అధునాతన పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించాలని, వృత్తిదారులందరికీ రక్షణ చర్యలు చేపట్టాలని, కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలన్నారు. హెచ్ఎల్‌సి 5వ కాలువ బైపాస్ పనులు చేపట్టి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు ఇవ్వాలని, మండల కేంద్రాల్లో అంబేద్కర్ స్మారక భవనాలకు స్థలాలు కేటాయించాలని, రాచేపల్లి వద్ద ఉన్న లిడ్ క్యాప్ చెప్పుల పరిశ్రమ ప్రారంభించి ఉపాధి కల్పించాలని, గ్రామాల్లో శ్మశాన స్థలాలు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని, ఉల్లికల్లు గ్రామం ముంపు బాధితులకు పరిహారం ఇచ్చి పునరావాసం ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. శింగనమల జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి ఇంగ్లీష్ మీడియం గ్రూపులు ఏర్పాటు చేసి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ప్రజారక్షణ భేరి సభను విజయవంతం చేయాలని ఈనెల 6 శింగనమల నుంచి స్కూటర్ జాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకన్న, జయరాముడు, ఎర్రిస్వామి, రామాంజనేయులు, గంపమల్లయ్య, ధన, మేకల పెద్దన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ. సూర్యప్రకాష్, వెంకటస్వామి, లాల్ మునయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, ఆంజనేయులు, కొండారెడ్డి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం



పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణను ఆపాలని ఈనెల 8న తలపెట్టిన విద్యాసంస్థల బంను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.ఆంజనేయులు, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్, ఎఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి సంఘాల నాయకులు బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎక్కడా ఉద్యోగాలు కల్పించిన పాపాన పోలేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్ ఖాళీలు భర్తీ చేస్తామని చెప్పి ఒక్క పోస్టు భర్తీ చేయలేదన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా రాష్ట్రంలో లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరణ చేయాలని చూడడం దారుణమని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని విద్యార్థి యువజన సంఘాలు అనేక దఫాలుగా పోరాటాలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్టుగా కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అంతేకాకుండా ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమలను కార్పొరేట్ వ్యక్తులకు తాకట్టుపెట్టే యోచనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రారంభిస్తామని ఇప్పటికే అనేకసార్లు శంకుస్థాపనలు చేశారే తప్ప చేసింది లేదన్నారు. రాయలసీమ జిల్లాలో డిగ్రీలు పీజీలు పూర్తిచేసుకుని ఉద్యోగ అవకాశాలు లేక చెన్నైకు బెంగళూరుకు కేరళకు వలసలకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిరుద్యోగులను ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, విశాఖపట్నంలో దాదాపు వెయ్యి రోజుల నుంచి వామపక్ష విద్యార్థి యువజన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ బంద్‌కు పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేట్, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించి మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు, ఎస్ఎఫ్ఐ అనిల్, ఎఐఎస్ఎఫ్ నవనీత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రుచికి మారుపేరు హర్ష హోటల్

ప్రజాశక్తి-అనంతపురం

అధినేత వెంకటాచలపతి



హర్ష హోటల్, అధినేత వెంకటాచలపతి

సుదీర్ఘకాలంగా రుచికీ.. రుచికీ.. ఖ్యాతిగాంచిన హిమబిందు హోటల్ నిర్వాహకులు బస్టాండ్ సమీపంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన బ్రాంచి హర్ష హోటల్ ప్రజల మన్ననలు పొందుతోంది. ఈ సందర్భంగా యాజమాని వెంకటాచలపతి మాట్లాడుతూ హిమబిందు హోటల్ ద్వారా అనంతపురంలో సుదీర్ఘకాలంగా ప్రజలకు నాణ్యత, స్వచ్ఛత, నమ్మకానికి మారుపేరుగా భోజనం అందిస్తున్నట్లు వివరించారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా తమ వద్దకు వచ్చే కస్టమర్లకు రుచికరమైన వంటకాలతో నాణ్యమైన ఆహారం అందించాలని లక్ష్యం పెట్టుకున్నట్టు తెలిపారు. తమ హోటల్‌లో ప్లేట్ మిల్స్, ఫుల్ మిల్స్‌తోపాటు నెలసరి టోకెన్లు, ఆర్డర్లపై క్యాటరింగ్ చేస్తున్నట్లు వివరించారు. ప్రతినెలా రూ.1,800 చెల్లిస్తే రోజూ ఒకపూట భోజనం అందించే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రజల అనుకూలతలను బట్టి ఫుల్‌మీల్స్, పార్సెల్ మిల్స్, మినీ క్యారియర్ పార్సెల్, ఫ్యామిలీ ప్యాక్ పార్సెల్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రముఖ ఫంక్షన్లు, శుభకార్యాలకు క్యాటరింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం ప్రజల కోసం ప్రత్యేకంగా ప్యూర్ వెజిటేరియన్ మీల్స్ హోటల్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. తనతో పాటుగా తమ సతీమణి నిరంతరం కస్టమర్లకు నాణ్యమైన భోజనాన్ని అందించే సంకల్పంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రజలు హిమబిందు హోటల్‌ను ఆదరించినట్టుగానే హర్ష హోటల్‌ను కూడా ఆదరించాలని కోరారు.

'టిడిపితోనే అభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి-నార్పల



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని సిద్ధరాచెర్ల ఎస్సీ కాలనీలో 'బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తుతోపాటు మన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టోను వివరించాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో సామాన్యులు ఏమీ కొనలేని, తినలేని దుస్థితికి చేరుకున్నారన్నారు. ప్రజల అరకొర సంపాదనంతా నిత్యావసర సరుకుల కొనుగోలుకే సరిపోతోందని మహిళలు ఆందోళన చెందుతున్నారన్నారు. చంద్రబాబు పాలనలో నిత్యావసర ధరలు అందుబాటులో ఉండేవన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి తెచ్చేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎర్రినాగప్ప, చంద్రబాబు, వెంకటనారాయణమ్మ, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, పప్పూరు సత్తి, వెంకటనారాయణరెడ్డి, సాంబశివారెడ్డి, మలిరెడ్డి, నాగభూషణ, ధనుంజయ, శ్రీనివాసులు, శంకర్, వెంకటేష్, శివ, భాస్కర్, తిరుపాలు, రాము, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నల్లమ్మ దేవర

శింగనమల : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం నల్లమ్మ దేవర అంగరంగ వైభవంగా సాగింది. శనివారం బెంగళూరు నుంచి శింగనమలకు వచ్చిన రామయ్య కుటుంబీకులు ఎస్సీ కాలనీలోని పొలంలో ఉన్న నల్లమ్మ దేవస్థానానికి చేరుకుని పుష్పాలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాత్రి నల్లమ్మ దేవి చరిత్రను కళాకారులు అద్భుతంగా వివరించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి మేకపోతులు, కోళ్లు బలిచ్చారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఉరవకొండ



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, గీతా ప్రచారక్ సభ్యులు దివాకర్ అన్నారు. ఆదివారం నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్ ఆధ్వర్యంలో పిల్లల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉరవకొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి డ్రాయింగ్, స్పెల్ బి, చదరంగం, పబ్లిక్ స్పీకింగ్ లాంటి నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించి 36 మందిని విజేతలుగా ప్రకటించారు. విజేతలకు 14న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ సిబ్బంది ఉపాధ్యాయులు భాగ్య, మహేశ్వరి, చాందినీ, స్వాతి, అమరేశ్వర్, చంద్రమోహన్, పోతప్ప, వేణుగోపాల్, నూర్, చిరంజీవి, యశ్వంత్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ..



పగిలిన బస్సు అద్దాలు

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలం పూలకుర్తి గేటు వద్ద ఆదివారం ఉదయం రాయదుర్గం నుంచి బళ్లారి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొంది. దీంతో బస్సు వెనకవైపు అద్దాలు పగిలాయి. టిప్పర్ ముందు భాగం దెబ్బతింది. బస్సు పులకుర్తి గేట్ వద్ద ఆపి ప్రయాణికులను దింపుతుండగా వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఘటనపై డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డిపో మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. గాయాలపాలైన బస్సు డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఉరవకొండ : పట్టణంలోని అనంతపురం బళ్లారి జాతీయ రహదారికి సమీపంలో ఉన్న రాములమ్మ గుడి పరిసరాల్లో కొన్నేళ్లుగా మతిస్థిమితం లేని వ్యక్తి సీనా (54) మృతి చెందడంతో ఆపద్బాంధవ ట్రస్టు, పోలీసులు, గ్రామ పంచాయతీ సభ్యుల సహకారంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. రాములమ్మ గుడి వద్ద సత్రంలో ఉంటూ మూడు రోజుల క్రితం మృతిచెందింది. అయితే ఎవరూ గమనించలేదు. ఎట్టకేలకూ స్థానికులు ఆదివారం గమనించి ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ తిమ్మయ్య, ఎస్ఐ వెంకటస్వామికి తెలియజేశారు. దీంతో అంతిమ సంస్కరాలు నిర్వహించడానికి పోలీసులు ఆపద్బాంధవ ట్రస్ట్ అధ్యక్షులు వేల్పుల మురళికి, వన్నూర్ సాబ్‌కి పంచాయతీ కార్యదర్శి గౌస్‌కి విషయం చెప్పవడంతో వారు వైకుంఠ రథం తీసుకొచ్చి వెలిగొండ రస్తా హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు, వేల్పుల మురళి, వన్నూర్‌సాబ్, నూర్‌బాషా, భీమేష్, అశోక్, రమేష్, నవీన్, పోలీసులు, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

పగడ్బందీగా ఓటరు జాబితా : ఆర్‌డిఒ

గుత్తి : తప్పులు లేకుండా పగడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలని ఆర్‌డిఒ వి.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ ఎంట్రీ, మరణించిన వారి పేర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని బిఎల్‌ఓలకు సూచించారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్. మహబూబ్ బాషా, ఆర్ఐ సందీప్, మున్సిపల్ అధికారులు రామాంజనేయులు, సుధాకర్, ఆపరేటర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మొరుసు సంజీవరెడ్డి రమాదేవి దంపతులు

నార్పల : మండల కేంద్రంలోని సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్యశిబిరంలో సుమారు వెయ్యిమంది వరకూ తరలివచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే జిల్లాలో పేరుపొందిన 15 ఆసుపత్రులకు చెందిన ప్రముఖ డాక్టర్లు గుండె, నరాలు, మెదుడు తదితర వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం పట్ల సరస్వతి విద్యా మందిరం పాఠశాల కరస్పాండెంట్ మొరుసు సంజీవరెడ్డి, ఎంపీటీసీ రమాదేవికి వృద్ధులు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సత్యనారాయణ, నిరంజన్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, శ్రీలక్ష్మి, సింధు, తిరుమల, తేజస్విణి, కృష్ణమూర్తి, విజయపాల్‌రెడ్డి, కృష్ణకాంత్‌రెడ్డి, కాత్యాయని, శ్రీదేవి, తారకరత్న, మోహన్, కృష్ణ, సాయికుమార్, వైద్య సిబ్బంది, సరస్వతీ పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

ఉరవకొండ : పట్టణంలోని 11వ వార్డులో రేషన్‌షాపును ఆదివారం ప్రారంభించారు. 11 వార్డులోని కొండప్పబావి వీధి, కొత్త పార్కు వెనుక ఉన్న ఏరియాల్లో నాలుగేళ్లుగా రేషన్‌షాప్ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బియ్యం పంపిణీ వాహనాలు కూడా ఆ ప్రాంతాలకు రాకపోవడంతో ప్రజలు రేషన్ కోసం దూర ప్రాంత రేషన్‌షాపులకు వెళ్లేవారు. ఈనేపథ్యంలో వైసిపి నాయకులు అన్వర్ చొరవతో నూతన రేషన్ షాపును ప్రారంభించారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో అప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, తాజు, వలంటీర్ భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయ మైదానంలో ఉన్న ఇవిఎంల గొడౌన్‌లో ఆదివారం నిర్వహించిన ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం గడువులోపు సజావుగా ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ సూపర్‌వైజర్ రవీంద్ర, ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డీపీఓ ప్రభాకర్‌రావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

పెద్దవడుగూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం చిరుధాన్యాల పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డిఎం జె.రవీంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ తరుపున జిల్లాలో చిరుధాన్యాల సేకరణ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని రైతులు స్థానికంగా పండించిన రాగులు, జొన్నలు, కొర్రల, కందులను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రాగులు క్వింటాకు రూ.3846, జొన్నలు రూ.3225, జొన్నలు హైబ్రిడ్ రూ.3180, కొర్రలు రూ.2125.00, కందులు రూ.7000 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. కావున రైతులు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణం, మండల వ్యవసాయ అధికారిణి మల్లేశ్వరి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం : విప్ కాపు

రాయదుర్గం : అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సిఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. సర్పంచి గౌని అనంతమ్మ అధ్యక్షతన శనివారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు బోయ గిరిజమ్మతో కలిసి ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ రాజకీయ సిఫారసులు లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాలకే నేరుగా నగదును జమ చేస్తున్నట్లు వివరించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నియమించిన జన్మభూమి కమిటీ సభ్యులు ప్రభుత్వ పథకాలకు రేట్లు ఫిక్స్ చేసి దోచుకున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా నీరు-చెట్టు, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లను సైతం వదలకుండా దోపిడీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డి, వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌టి.సిద్ధప్ప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు, కాంట్రాక్టర్ ఆర్‌టి కాంతారెడ్డి, సర్పంచులు ఉమేష్, రమేష్, ఎంపీటీసీలు, నాయకులు ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచి విజయేంద్ర, తిప్పేరుద్ర, సిద్ధప్ప, ఈరన్న, బాషా, భాగన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.